సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 13-9-2024

సంపుటి: 20 సంచిక: 146

పేజీలు: 4 వెల: రూ.1


## కాంగ్రెస్‌లో కుమ్ములాట


### పేడాడ పరమేశ్వరరావుపై ఫిర్యాదు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమని మరోసారి రుజువైంది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా కొత్తగా ఎన్నికైన అంబటి కృష్ణ పాత అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు మీద రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడం దీనికి తాజా ఉదాహరణ. ఈ నెల 10న ఉదయం 8 గంటలకు పరమేశ్వరరావు బాధ్యతలు అంబటి కృష్ణకు అప్పగించి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో ఫర్నిచర్, ఏసీలు, టీవీ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయాయి. అయితే అక్కడికి రెండు రోజుల తర్వాత డీసీసీ కార్యాలయాన్ని పేడాడ పరమేశ్వరరావు తగులబెట్టేశారంటూ కొత్త అధ్యక్షుడు కృష్ణ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం పోలీసుల ద్వారా సమాచారమందుకున్న కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఫిర్యాదు విషయమై కొత్త అధ్యక్షుడు కృష్ణతో మాట్లాడారు. దీంతో చేసేదిలేక షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం - మిగతా 4లో



శ్రీకాకుళం ఫాజుల్‌బాగ్‌పేటలోని దేవాంగులవీధిలో గౌరీ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాల్లో భాగంగా దీపారాధన, 108 ప్రసాదాల నివేదన నిర్వహించారు. కమిటీ కుర్రాళ్లు శబరి శేఖరబాబు, గణేష్, బాలు, పండు, హేమాత్, శ్రీను, బుచ్చిరాజు, యూత్ కుర్రాళ్లు, మహిళలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం











**ధరలు పట్టిక 13.09.2023 — గత ఏడాది కాయగూరల ధరలు**

1- టమోటా - 18.00
2- వంకాయలు - 26.00/30.00
3- బెండకాయలు -20.00
4- బీరకాయలు - 34.00
5- కాకరకాయలు - 36.00
6- దొండకాయల-.20..00
7 - క్యాబేజి బుట్ట - 20. 00
8 - గోల్కొండ చిక్కుడు -20.00
9 - ఫ్రెంచ్ బీన్స్-66.00
10 - క్యారెట్ -34.00
11 - బీట్రూట్ -34.00
12 - ఉల్లిపాయలు :30.00/28.00
13 - బంగాళదుంపలు - 20.00/22.00
14 - పచ్చిమిర్చి- 46.00
15. అల్లం -140.00/180.00
16 - వెల్లుల్లి -130.00/170.00
17 - క్యాప్సికమ్-50.00
18 - కీరదోస-28.00
19- కాలీఫ్లవర్ -

**ధరలు పట్టిక 13.09.2024 — ఈ ఏడాది ధరలు**

1- టమోటా - 36.00
2-వంకాయలు-36.00/40.00
3- బెండకాయలు -35.00
4- బీరకాయలు -46.00
5- కాకరకాయలు - 36.00
6- దొండకాయల-.30.00
7 - క్యాబేజి బుట్ట - 30.00
8 - గోల్కొండ చిక్కుడు -48.00
9 - ఫ్రెంచ్ బీన్స్-86.00
10 - క్యారెట్ -36.00
11 - బీట్రూట్ -36.00
12 - ఉల్లిపాయలు :.55.00/46.00
13 - బంగాళదుంపలు -32.00
14 - పచ్చిమిర్చి- 50.00/56.00
15. అల్లం -136.00/90.00
16 - వెల్లుల్లి -290.00/310.00
17 - క్యాప్సికమ్-80.00
18 - కీరదోస-36.00

- గత ఏడాదితో పోలిస్తే కూరగాయల ధరలు డబుల్
- ధరల స్థిరీకరణపై దృష్టి పెట్టని ప్రభుత్వాలు
- వర్షాభావంపై నెపం నెట్టేస్తున్న అధికారులు
- సగటు వ్యయంలో 90 శాతం తినడానికే సరిపోతుంది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు దాటి పరుగులు తీస్తున్నాయి. దీంతో సామాన్యుడి పరిస్థితి ఘోరంగా మారుతోంది. కేవలం ధరల పెరుగుదల కారణంగా దేశంలో ద్రవ్యోల్బణం రెండు నెలల క్రితం 3.5 శాతానికి చేరింది. గత ఐదు సంవత్సరాల కాలంలో రిటైల్ ధరలు ఇంత ఎక్కువ నమోదు కావడం ఇదే మొదటిసారి. కీలకమైన ఆహార వస్తువుల ధరలు పెరగడం వల్ల వినియోగంలో తగ్గుదల నమోదై దేశంలో ద్రవ్యోల్బణం ఏర్పడుతోంది. సగటు కుటుంబం తన నెలసరి వ్యయంలో సగం సగం ఆహారం, దాని అనుబంధ వస్తువుల కొనుగోలుకే ఖర్చు చేస్తుంది. వినాయకచవితి, దసరా, దీపావళి పండుగల వేళ సామాన్యుడికి కష్టకాలం వచ్చింది. రుతుపవనాల వల్ల దేశంలో ఒకచోట అధిక వర్షపాతం, మరోచోట అత్యల్ప వర్షపాతం నమోదు కావడం వల్ల కూరగాయల దిగుబడిపై దాని ప్రభావం పడింది. కీలకమైన ఉల్లి, బంగాళా దుంపలు ఈ నెలలో గత ఏడాదితో పోలిస్తే 65.64 శాతం పెరిగాయి. అలాగే ఉల్లిపాయల దిగుబడి 20 శాతం, బంగాళ దుంపల దిగుబడి 6 శాతం పడిపోయింది. వీటికి కారణం వర్షాల్లో తేడాలే ఈ ఏడాది అక్టోబరులో కొత్త పంట చేతికి వచ్చేలోపు ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇవి మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు 'సత్యం' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడయింది.

బహిరంగ మార్కెట్‌లో ఒక్కో వ్యాపారస్తుడి వద్ద ఒక్కో ధర ఉండటం వల్ల రైతుబజార్లలో విక్రయిస్తున్న ధరలను ప్రామాణికంగా తీసుకొని 'సత్యం' జరిపిన పరిశోధన ప్రకారం గత ఏడాది సెప్టెంబర్ 13న టమోటా కిలో రూ.18 ఉండగా, ప్రస్తుతం కిలో టమోటా ధర రూ.36 పలుకుతుంది. బహిరంగ మార్కెట్‌లో రూ.46 నుంచి రూ.50కి పైగా ధర పలుకుతుంది. జూన్, జూలైల్లో టమోటా ధర రూ.100కు చేరింది. సకాలంలో వర్షాలు పడడం, ఇతర జిల్లాలో పంట చేతికి రావడంతో క్రమంగా కిలో రూ.24కి తగ్గింది. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో రైతు బజార్లో రూ.36కి బహిరంగ మార్కెట్‌లో రూ.50కి ఎగబాకింది. రైతు బజార్లో బంగాళదుంపలు కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.32 వద్ద స్థిరంగా ఉంది. జూన్, జూలైల్లో రూ.50కి చేరింది. ప్రస్తుతం కిలో ఉల్లిపాయలు రూ.55కు చేరాయి. గత ఏడాది ఈరోజుకు కిలో ఉల్లి ధర రూ.30గా రైతుబజారులో అందుబాటులో ఉండేది. వెల్లుల్లి కిలో ఏడాదిలో 100 శాతం ధర పెరిగింది. గత ఏడాది కిలో వెల్లుల్లి రూ.170 ఉండగా, ప్రస్తుతం రూ.310కి చేరింది. బహిరంగ మార్కెట్లో రూ.350కు పైగా పలుకుతుంది. బెండ, దొండ, వంకాయ, బీర, కాకర, పచ్చిమిర్చి, బీన్స్ ధరలు రెట్టింపయ్యాయి.

అధికారంలోకి వస్తే ధరలను స్థిరీకరిస్తామని ప్రకటించడం తప్ప ఆచరణకు నోచుకోవడంలేదు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ప్రభుత్వ విధానాల వల్లే ధరలు పెరుగుతున్నాయని ఆరోపణలు చేసి రాజకీయంగా లబ్ధి పొందుతున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల స్థిరీకరణ అంశం గాలికొదిలేస్తున్నాయి. దీంతో - మిగతా 4లో



ప్రతిఒక్కరికి ఏదో సందర్భంలో ఎదురయ్యే ప్రశ్న ఇది. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విభాగాల శిక్షణ తరగతుల్లో ఈ ప్రశ్న, దాని మీద వివరణ సహజంగా ఉంటుంది. మన సమాధానం విలువ ఎంత అనేది ఆ చర్చ నడిపిన నాయకుడి సైద్ధాంతిక స్థాయిని బట్టి ఉంటుంది. ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా)తో మొదలైన నా రాజకీయాలు సీపీఎం డివిజన్ స్థాయి వరకు క్రియాశీలకంగా పని చేశాను. 1995-1999 మధ్య ఉద్యమాలు, ఎన్నికలతో పాటు శిక్షణ తరగతులు (పొలిటికల్ క్లాసెస్) విధిగా హాజరయ్యేవాడిని. 1996లో ఒక సందర్భంలో పైన పేర్కొన్న ప్రశ్న 'మీ అభిమాన నాయకుడు ఎవరు?' అన్నదానికి ఎక్కువ మంది సుందరయ్య, కార్ల్ మార్క్స్, జ్యోతి బసు.. ఇలా పెద్ద పేర్లు ఉన్న సమాధానాలు వచ్చాయి. ఆ సెషన్‌లో మాట్లాడిన సీతారాం ఏచూరి.. మీ చుట్టుపక్కల ఉన్న కామ్రేడ్స్ మిమ్మల్ని ప్రభావితం చేయటం లేదా? మీరు కేవలం పుస్తకాల్లో చదివిన దాంతోనే ప్రభావితం అవుతున్నారా? అని అడిగారు.

- శివ రాచర్ల

# మీ అభిమాన నాయకుడు ఎవరు?

ఒక ప్రశ్న మనం చూసే దృష్టిని మారుస్తుంది. అప్పటి నుంచి పీర్ ప్రజర్ కాదు పీర్ ఇన్‌ఫ్లుయెన్స్, మా నాయకుడు పుల్లయ్య కానీ ఐడియోలాజికల్ మెంటార్ డాక్టర్ శాస్త్రి, రాష్ట్రస్థాయిలో జక్కా వెంకయ్య, జాతీయ స్థాయిలో ఏచూరి నుంచి కొత్తగా నేర్చుకోవటం అలవాటయ్యింది. సీతారాం ఏచూరి నిన్న మరణించిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురించి ఒక పత్రికలో హి ఈజ్ క్లోజ్ టు ఢిల్లీ అని రాశారు. 1996–2016 మధ్య ఎవరు అధికారంలో ఉన్నా సీతారాం ఏచూరి సలహాలు సంప్రదింపులు జరిగేవి. సీతారాం రాజకీయ నాయకుడి కన్నా ముందు ఆర్థికవేత్త ఆయన సాధించిన ఏ ప్లస్ ఆల్ఫా గ్రేడ్ ఇప్పటికీ ఇన్‌బీటెన్ అంటారు అనేక సోషలిస్టు దేశాలకు ఆర్థికపరమైన అంశాలలో సీతారాం సన్నిహితులు. సీతారాం ఢిల్లీకే కాదు ప్రతిఒక్కరికి సన్నిహితులు. ఆయన పాల్గొనే సభల్లో అందరితో మాట్లాడేవారు. ముఖ్యంగా లంచ్ టైమ్‌లో అందరితో పాటే తింటూ వారు అడిగే ప్రశ్నలకు ఓపికగా సమాధానం ఇచ్చేవారు. అలాంటి సందర్భాల్లోనే ఆయనతో మాట్లాడే అవకాశం రెండుసార్లు వచ్చింది.

ఒక సందర్భంలో మా డివిజన్ నాయకుడు 'సార్, మీరు మా ఆస్తి, మీరు స్మోకింగ్‌ను తగ్గించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోండి' అని సీతారాంతో అంటే ఆయన నవ్వుతూ ప్రయత్నం చేస్తాను అన్నారు. ఆ తర్వాత ఆ నాయకుడిని నేను అడిగాను అంత ధైర్యంగా ఎలా అడిగారని.. కామ్రేడ్ కదా? అని సింపుల్‌గా అన్నారు. ఒక ఆర్టికల్ చదివాను.. సీతారాం మొదట్లో రాజకీయాల్లోకన్నా ఆయన స్టైల్, లాంగ్వేజ్‌ల మీదనే మీడియాలో ఎక్కువ కవరేజ్ వచ్చేదని. దట్ బర్కలీ స్మోకింగ్ బోయ్ అని శోభాడే 80లలో రాసారంట. సుందరయ్య నుంచి హరికిషన్ సుర్జీత్ వరకు మద్రాస్ నుంచి విడిపడి ఆంధ్రరాష్ట్రం తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడటంతో మద్రాస్ నుంచి హైద్రాబాద్‌కు వచ్చిన సీతారాం కుటుంబం 1969లో జరిగిన ముల్కి, నాన్ ముల్కి గొడవల్లో సీతారాం బేస్ ఢిల్లీకి మారింది. అక్కడి నుంచే జేఎన్‌యూ విద్యార్థి నేతగా ఎదగటం, సీపీఎం నాయకుడు కావటం. 1977లో జేఎన్‌యూ అధ్యక్షుడిగా విద్యార్థులతో కలిసి ఇందిరాగాంధీ ఇంటికి వెళ్లి ఆవిడ మీద ఒక ఛార్జ్‌షీట్‌ను చదివి వినిపించి జేఎన్‌యూ వైస్ ఛాన్సలర్ పదవికి రాజీనామా చేయమని అడగటం పెద్ద సంచలనం, కొద్ది రోజుల తర్వాత ఇందిరా రాజీనామా చేశారు. తొలి రోజుల్లో సుందరయ్యతో (అప్పుడు సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు) సన్నిహితంగా పనిచేయటం సీతారాంకి బాగా ఉపయోగపడింది. ఢిల్లీ సిక్కు అల్లర్ల సందర్భంలో సిక్కుల రక్షణకు సీపీఎం చేసిన కృషిలో సీతారాంది ముఖ్యపాత్ర. ఈఎంఎస్ నంబూద్రి ప్రోత్సాహంతో సీతారాం సీపీఎం ఫుల్ టైమర్‌గా వచ్చారు. సుందరయ్య తర్వాత హరికిషన్ కింగ్ సుర్జీత్‌తో సన్నిహితంగా పనిచేశారు. 1996 యునైటెడ్ ఫ్రంట్ కామన్ మినిమమ్ ప్రొగ్రామ్ రూపకల్పన చిదంబరం, సీతారాం చేశారు అని రాశారు. అయితే కామన్ మినిమమ్ ప్రొగ్రామ్ అవసరాన్ని గుర్తించిన నేత హరికిషన్ సింగ్ సూర్జిత్. 1977లో జనతా పార్టీ ప్రభుత్వానికి ఇలాంటి కామన్ మినిమమ్ ప్రొగ్రామ్ లేకపోవటం వలనే అది ఎక్కువ కాలం నిలవలేదని సూర్జిత్ భావించారు.

### చారిత్రాత్మక తప్పు

1996లో యునైటెడ్ ఫ్రంట్ తరఫున సీపీఎం నేత అప్పటి బెంగాల్ సీఎం జ్యోతి బసును ప్రధానిగా ఉండమని వీపీ సింగ్ కోరారు. సీపీఎం పార్టీ సెంట్రల్ కమిటీలో జరిగిన చర్చలో ప్రధాని పదవి తీసుకోకూడదని మెజారిటీ ఓటింగ్ చేయటంతో జ్యోతిబసు ప్రధాని కాలేకపోయారు. 2005 నుంచి ప్రకాశ్ కారత్ – సీతారాం ఏచూరిల అభిప్రాయం ప్రకారమే దాదాపు సీపీఎం నడిచింది, నాకు తెలిసి ఏ విషయం మీద ముఖ్యంగా బెంగాల్లో కాంగ్రెస్‌తో పొత్తులాంటి అంశాల మీద సెంట్రల్ కమిటీలో ఓటింగ్ జరగలేదు. ప్రకాశ్ కారత్, సీతారాం ఏచూరిల అభిప్రాయాలకు భిన్నంగా నిర్ణయాలు జరగలేదు. కానీ 1996లో జ్యోతిబసు ప్రధాని కావాలని నాటి ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్, జ్యోతిబసు భావించినా సెంట్రల్ కమిటీలో మాత్రం వారికి మద్దతు దక్కలేదు. సీతారాం ఏచూరి, ప్రకాశ్ కారత్ ఇద్దరూ ప్రధాని పదవికి వ్యతిరేకమే. వీరితో పాటు ఈకే నాయనార్, వీఎస్ అచ్యుతానందన్, రామచంద్రన్ పిళ్లై, ఈ.బాలానందన్, సునీల్ మైత్రా తదితర సీనియర్ నాయకులు కూడా జ్యోతిబసు ప్రధాని పదవికి వ్యతిరేకమే. ప్రధాని పదవి తీసుకోకపోవటం చారిత్రక తప్పు అని సీతారాం ఏచూరి అన్నట్లు కొన్ని పత్రికలూ రాశాయి. ఆ మాట అన్నది జ్యోతి బసు. 1997 జనవరిలో ఎం.జె.అక్బర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జ్యోతి బసు ప్రధాని పదవి తీసుకోకపోవటం చారిత్రక తప్పు అని అన్నారు. 2017లో ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు వెంకయ్య నాయుడు మోదీ మొదటి ప్రభుత్వంలో పార్లమెంటరీ శాఖ మంత్రిగా ఉన్నారు. రాజ్యసభలో సీతారాం ఏచూరిని కాసుకోవటమే వెంకయ్యనాయుడికి ముఖ్యమైన పనిగా ఉండేది. 2015 బడ్జెట్ – రాష్ట్రపతి ప్రసంగం మీద సీతారాం ఏచూరి ప్రవేశపెట్టిన సవరణలు రాజ్యసభ ఆమోదం పొందటం ప్రభుత్వానికి పెద్ద అవమానం. ఆ సవరణలను విరమించుకోమని వెంకయ్యనాయుడు, అరుణ్ జైట్లీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సీతారాం వ్యతిరేకించిన చారిత్రక తప్పు న్యూక్లియర్ డీల్‌కు వ్యతిరేకంగా సీపీఎం యూపీఏ–1కు మద్దతు ఉపసంహరించాలని 2007లో నాటి ప్రధాన కార్యదర్శి ప్రకాష్ కారత్ చేసిన ప్రతిపాదనను సీతారాం వ్యతిరేకించారు. 2008 జులైలో బీజేపీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి సీపీఎం మద్దతు ఇవ్వటాన్ని సీతారాం వ్యతిరేకించారు. 2011 ఎన్నికల్లో బెంగాల్లో సీపీఎం ఓడిపోవటంతో ప్రకాష్ కారత్ నాయకత్వం మీద విమర్శలు వచ్చాయి. 2015లో సీతారాం ఏచూరి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

### కేరళ సీపీఎం వర్గ గొడవలు

2015లో సీపీఎం ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన సీతారాంకు 2016 కేరళ ఎన్నికలు తొలి పరీక్ష పెట్టాయి. ఆ ఎన్నికల్లో లెఫ్ట్ ఫ్రంట్ గెలిచింది కానీ సీఎం పదవి కోసం వీఎస్ అచ్యుతానందన్, విజయన్ వర్గాలు పోటీపడ్డాయి. ఒక దశలో కేరళ సీపీఎం చీలిపోతుందేమో అనే స్థాయికి విబేధాలు చేరాయి. సీతారాం ఏచూరి ఆ సమస్యను విజయవంతంగా పరిష్కరించి విజయన్ సీఎం అయ్యేలా వీఎస్ అచ్యుతానందన్‌ను ఒప్పించారు. ఆ సందర్భంలో అచ్యుతానందన్‌ను ఇండియన్ ఫిడెల్ కేస్ట్రో అని సీతారాం పోల్చారు. ఎన్నికల రాజకీయాలు ఎన్నికలు లేని సమయంలో పొత్తులు ఎన్నికలు ముఖ్యం కాదు పార్టీ విస్తరణ, ప్రత్యామ్నాయ రాజకీయాలే ముఖ్యం అనే సీపీఎం ఎన్నికల సమయంలో మాత్రం ఏదో ఒక పొత్తు పెట్టుకుంటూనే ఉంది. సీపీఎం వరుస అపజయాలకు సీతారాం ఏచూరి ఒక్కడే బాధ్యుడు కాదు కానీ ఆయన ప్రధాన కార్యదర్శి అయిన తర్వాత 2016 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని కూడా కాంగ్రెస్ కన్నా తక్కువ సీట్లు గెలిచింది. 2019, 2024 ఎన్నికల్లో బెంగాల్ నుంచి సీపీఎం ఒక్క ఎంపీ సీట్ కూడ గెలవలేదు, కేంద్రీకరించి పని చేయటం అనే సిద్ధాంతం ఇక్కడ పనిచేయలేదు. 2019 ఎన్నికల్లో కేవలం మూడు, 2024లో నాలుగు లోక్‌సభ స్థానాలు గెలవటం సీతారాంకు నిరాశ కలిగించి ఉండొచ్చు. కానీ సీపీఎం చరిత్రలో తొలిసారి రాజస్థాన్ నుంచి ఒక ఎంపీ సీట్ గెలవటం కొంత ఊరట. 2016 బెంగాల్ ఎన్నికల ఓటమి తర్వాత 2018 త్రిపుర ఎన్నికల కోసం పార్టీని సంసిద్ధం చేయలేకపోయారు. బెంగాల్లో బీజేపీ ప్రతిపక్ష స్థాయికి ఎదిగిన తర్వాత కూడ త్రిపురలో బీజేపీ ఎదుగుతున్న తీరును అంచనా వేయలేకపోయారు. త్రిపురలో 1993 నుంచి 25 సంవత్సరాల పాటు సాగిన సీపీఎం పాలన 2018లో బీజేపీ గెలుపుతో ముగిసింది. ప్రకాశ్ కారత్ హయాంలో బెంగాల్‌లో ఓటమి సీతారాం హయాంలో త్రిపుర ఓటమి వైఫల్యాలుగా మిగిలిపోతాయి. సీపీఎం లేదా లెఫ్ట్ ఫ్రంట్ ఎన్నికల ఓటమిలకు కారత్ లేదా ఏచూరిలను పూర్తి బాధ్యులను చేయలేం. కానీ 1996లో జ్యోతిబసును ప్రధాని కానీయకుండా అడ్డుకోవటం, 1998లో వాజ్‌పాయి ప్రభుత్వాన్ని కూల్చిన సందర్భంలో సీపీఎం చెప్పిన సిద్ధాంతం మాత్రం వీరి హయాంలో వాస్తవికత లేని సిద్ధాంతంగా నిరూపించబడింది. 1999 ఏప్రిల్ 17న ఒక్క ఓటు తేడాతో విశ్వాస తీర్మానం ఓడిపోయిన సందర్భంలో 13 రోజులు 13 నెలలు ఈసారి 13 సంవత్సరాలు పాలిస్తామని వాజ్‌పేయి అన్న మాట మోదీ హయాంలో నిజమైంది. నివాళి నరాలు కంటికి కనిపించకపోవచ్చు కానీ అవే జీవనాధారం. ఒక ప్రణబ్ ముఖర్జీ, ఒక హరికిషన్ సింగ్ సుర్జీత్, ఒక మూపనార్, ఒక చిదంబరం, ఒక సీతారాం ఏచూరి.. వీరి పాత్ర భారత రాజకీయాల్లో అత్యంత ముఖ్యమైనది. వీరిలో కొందరు పెద్ద పదవులు చేపట్టి ఉండొచ్చు కానీ వీరు 'నిర్మాణం' తెలిసిన నేతలు. అనేక క్లిష్ట సమయాల్లో సమర్థమైన రాజకీయాలు నడిపినవారు. 72 సంవత్సరాల సీతారాం ఏచూరి ఊపిరితిత్తుల సమస్యతో కొంతకాలంగా ఇబ్బంది పడుతూ నిన్న ఎయిమ్స్‌లో మరణించారు. నా ఉద్దేశంలో సీతారాం తర్వాత భారత రాజకీయాలను ప్రభావితం చేసే మరో ప్రధాన కార్యదర్శిని సీపీఎం భవిష్యత్తులో ఇస్తుందని నేను భావించను. ఆ కోవలో సీతారాం చివరి కామ్రేడ్. 1964లో ఆవిర్భవించిన సీపీఎంకు సుందరయ్య (1964–1978), నంబూద్రి పాద్ (1978–1992), సూర్జిత్ (1992–2005), ప్రకాశ్ కారత్ (2005–2015), సీతారాం ఏచూరి (2015–2024) ప్రధాన కార్యదర్శులుగా పనిచేశారు. వీరిలో సీతారాం మాత్రమే పదవిలో ఉండగా మరణించారు. ఇప్పుడు సీపీఎం కొత్త ప్రధాన కార్యదర్శిని ఎన్నుకోవాలి.

**జోహార్ కామ్రేడ్ సీతారాం.**



• ఎడిటోరియల్

# క్లీన్ కొల్లేరు సాధ్యమేనా?

విజయవాడ మునకకు బుడమేరు పోటెత్తడం కారణం. బుడమేరు పోటెత్తడానికి కొల్లేరు కారణం. బుడమేరుకు వరద వచ్చినప్పుడు ఆ వరద చాలావరకు కొల్లేరు సరస్సులో కలుస్తుంటుంది. కానీ అదే పూర్తిగా ఆక్రమణలతో ముఖద్వారం మూసుకుపోయి బుడమేరు వరదను తనలోకి తీసుకోలేకపోవడం వల్లే బుడమేరు విజయవాడపైకి దండెత్తింది. దాంతో కొల్లేరు ఆక్రమణలు అనే చాలా పాత సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. వరద పరిస్థితి చాలావరకు తగ్గుముఖం పట్టడంతో ప్రభుత్వం వరదలకు కారణమైన అంశాలపై దృష్టి సారిస్తోంది. కొల్లేరులో ఆక్రమణలను పూర్తిగా తొలగించి పూర్వపు స్వరూపం సంతరింపజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించారు. దానికి తొందరలోనే కార్యాచరణ ప్రారంభిస్తామంటున్నారు. కానీ గత అనుభవాలను పరిశీలిస్తే కొల్లేరును ఆక్రమణల నుంచి రక్షించడం అంత సులభం కాదని అర్థమవుతుంది. దీనికి ప్రధాన అవరోధం రాజకీయాలే. ఎందుకంటే కొల్లేరును ఆక్రమించి ఎడాపెడా చేపలు, రొయ్యల చెరువులు తవ్వేసి కోట్లు ఆర్జిస్తున్నవారిలో ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన చిన్నా పెద్దా రాజకీయ నేతలు, వారి బంధుగణం, అనుచరగణాలే. ఈ కారణంతోనే గతంలో ప్రభుత్వం చేపట్టిన క్లీన్ కొల్లేరు ఆపరేషన్లు మట్టికొట్టుకుపోయాయి. ఆక్రమణలు మాత్రం పెరిగిపోయాయి. ఆసియాలోనే అతిపెద్ద మంచినీటి సరస్సుల్లో ఒకటిగా పేరొందిన కొల్లేరు రాష్ట్రానికి ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం. సుమారు 245 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ సరస్సుకు ఆక్రమణలే పెద్ద శాపంగా పరిణమించాయి. వీటిని తొలగించి కొల్లేరును కాపాడతామని అధికారంలో ఉన్న ప్రభుత్వాలన్నీ చెప్పే మాటే. కానీ దశాబ్దాలుగా అది కార్యరూపం దాల్చడంలేదు. తాజాగా విజయవాడ వరదల నేపథ్యంలో చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కొల్లేరును క్లీన్ చేస్తామని చెబుతోంది. ఒక్కసారి గతంలోకి వెళితే ఇదే చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో గతంలో కూడా ఇదే మాట చెప్పారు. కానీ ఏమీ చేయలేకపోయారు. 1999లో అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం కొల్లేరు ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక జీవో జారీ చేసింది. కానీ అది ఆచరణకు నోచుకోలేదు. తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కొల్లేరు ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలనుకున్నారు. 2006లో వైఎస్ ప్రభుత్వం మరో జీవో జారీ చేసింది. ఆ మేరకు కొల్లేరును ఆక్రమించి నిర్మించిన ఆక్వా చెరువులను బ్లాస్టింగ్ ద్వారా ధ్వంసం చేశారు. దాంతో ఆక్రమణదారులు సుప్రీంకోర్టుకు వెళ్లి ప్రభుత్వ యత్నాలను న్యాయపరంగా అడ్డుకున్నారు. అంతే.. అప్పటినుంచీ ప్రభుత్వం కొల్లేరు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోయి సరస్సు స్వరూపాన్ని మార్చేశాయి. మరోవైపు గత ప్రభుత్వం కొల్లేరు భూముల్లోనే పలువురికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కొల్లేరు చిక్కిశల్యమైపోయింది. ఇతర వాగులు, వంకల నుంచి వచ్చే వరద నీటిని తనలోకి తీసుకునే శక్తిని కోల్పోయింది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలోని 12 మండలాలకు చెందిన 120కిపైగా గ్రామాలకు కొల్లేరే జీవనాధారం. 1970 ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం కొల్లేరులో చేపలు, రొయ్యల పెంపకానికి అనుమతి ఇస్తూ తీసుకున్న నిర్ణయం పరిసర గ్రామాల్లోని లక్షలాది మందికి ఉపాధి కల్పించినా.. మరోవైపు కొల్లేరుపై ఆక్రమణదారుల దాడికి కారణమైంది. కాలక్రమంలో ఆక్వా పరిశ్రమ నష్టాల పాలైనా చేపల పెంపకం ద్వారా మాత్రం ఇక్కడివారికి మంచి ఆదాయమే లభిస్తోంది. కొల్లేరు ప్రాంతవాసులు సొసైటీలుగా ఏర్పడి చేపల వేట, విక్రయాలతో జీవనం సాగిస్తున్నారు. అదే సమయంలో అంగ, అర్థబలం ఉన్నవారు, రాజకీయ నాయకులు, వారి బంధుగణాలు, అనుచరవర్గాల దృష్టి కొల్లేరుపై పడింది. కొల్లేరు ద్వారా వస్తున్న ఆదాయం చూసి ఆదో బంగారు బాతులా కనిపించింది. అయితే దాని ఆదాయాన్ని క్రమంగా కాకుండా ఒకేసారి కొల్లగొట్టేయాలన్న అత్యాశతో ఏకంగా కొల్లేరు విధ్వంసానికి పాల్పడటం ప్రారంభించారు. చాలామంది కొల్లేరు గర్భాన్ని, ముఖద్వారాన్ని ఆక్రమించి చేపలు, రొయ్యల చెరువులు తవ్వించి కొల్లేరు సహజత్వాన్ని దెబ్బతీశారు. వీటి ద్వారా కోట్లలో వ్యాపారాలు చేస్తుంటే కొల్లేరు రూపరేఖలు మారిపోవడం ప్రారంభమైంది. మరోవైపు కొల్లేరు తీరప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ అక్రమాలు పెచ్చరిల్లిపోయాయి. కొల్లేరు తీరాన్ని నలువైపులా ఆక్రమించి, చదునుచేసి ప్లాట్లు వేసి విక్రయించడం ద్వారా రెండు జిల్లాల్లో చాలామంది రెండు చేతులా సంపాదించి కోట్లకు పడగలెత్తారు. ఇది ఎంతగా హద్దుమీరిందంటే.. సరస్సులోకి ఇతర వాగులు, వంకల నీరు ప్రవేశించే మార్గాలన్నీ దాదాపు మూసుకుపోయాయి. దాంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద నీరంతా కొల్లేరులో వెళ్లలేక చుట్టుపక్కల గ్రామాలను ముంచెత్తుతోంది. ఆ క్రమంలోనే ఊహించనంతగా వచ్చిన బుడమేరు వరద కొల్లేరులోకి ప్రవహించలేక విజయవాడపై దండెత్తి లక్షలాది మందిని నిలువ నీడ లేకుండా చేసింది. ఈ అనుభవంతో కళ్లు తెరిచిన చంద్రబాబు ప్రభుత్వం క్లీన్ కొల్లేరు కార్యక్రమం చేపడతామని ప్రకటించింది. అయితే ఈ విషయంలో గతంలో స్వయంగా చేదు ఫలితాలు రుచి చూసిన అనుభవం ఉన్న చంద్రబాబు ఈసారైనా రాజకీయ, ఇతరత్రా ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఆక్రమణ అంతు చూస్తే తప్ప కొల్లేరుకు పూర్వ వైభవం సాధ్యం కాదు.

## వినతులు స్వీకరించిన మంత్రి అచ్చెన్న



(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్థక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సత్వరం పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. మంత్రి అచ్చెన్నాయుడు తన క్యాంపు కార్యాలయంలో ప్రజలు నుంచి వచ్చే సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నారు.

## ఉద్యమాలకు తీరని లోటు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

కమ్యూనిస్టు ఉద్యమ నేత సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు, ప్రజాతంత్ర లౌకిక ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపచేసి విప్లవ శక్తులను కొత్త పుంతలు తొక్కించడానికి విరామమెరుగక కృషిచేసిన వ్యక్తి ఏచూరి అని అన్నారు. సంతాప సభలో సీపీఐ నాయకులు కె.శ్రీనివాస్, సీపీఎం నాయకులు కే.మోహనరావు, జి.సింహాచలం, కే.శ్రీనివాస్, వీజీకే మూర్తి, పి.తేజేశ్వరరావు, కే.అప్పారావు, ఎస్.భాస్కరరావు, లక్ష్మీ, శ్రీదేవి, వెంకటరావు పాణిగ్రాహి, ఎం.గోవర్ధనరావు, ఆదినారాయణమూర్తి, కే.సూరయ్య, ఎన్.వి.రమణ, పార్వతీశం, రామచంద్రరావు, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏచూరి మృతికి ఐజేయూ సంతాపం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

సీపీఎం జాతీయ కార్యదర్శిగానే కాకుండా దివంగత సీతారాం ఏచూరి జర్నలిస్టుగా సుప్రసిద్ధుడని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు గుర్తుచేస్తూ ఏచూరి మృతిపై ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ అధికార వారపత్రిక పీపుల్స్ డెమోక్రసీకి చాలా ఏళ్లు సంపాదకుడిగా పని చేశారని, కొన్ని జాతీయ ఇంగ్లీషు పత్రికలకు కాలమిస్టుగా వ్యాసాల రాశారని ధర్మారావు తెలిపారు. ఆయన భార్య సీమా చిస్తీ కూడా జర్నలిస్టేనని, బీబీసీ హిందీ విభాగానికి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఢిల్లీ రెసిడెంట్ ఎడిటర్‌గా పని చేశారని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ది వైర్ అనే పోర్టల్‌కు ఎడిటర్‌గా ఉన్నారని తెలిపారు. వారి కుటుంబానికి ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే, స్వామ్నా తరపున సానుభూతి తెలిపారు. యూనియన్ నాయకులు ఎన్.ఈశ్వరరావు, ఎంవీ మల్లేశ్వరరావు, జగదీష్, చింతాడ అప్పలనాయుడు, జీవీ నాగభూషణరావు, ఎస్.నాగచైతన్య, చౌదరి సత్యనారాయణ సంతాపం ప్రకటించారు. ఉత్తరాంధ్రతో ఏచూరికి ఉద్యమ సంబంధాలు ఉన్నాయని, స్టీల్‌ప్లాంట్ ఉద్యమంలో పాల్గొన్నారని సిక్కోలు జలసాధనసమితి అధ్యక్షుడు దుప్పల రవీంద్రబాబు, ప్రజా న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు, వాయిస్ ఆఫ్ ది వాటర్ అధ్యక్షుడు పొలిశెట్టి మురళీకృష్ణ తదితరులు సంతాపం ప్రకటించారు.






# నిఖిల్.. ఈ ఒక్క రిస్క్‌లో నెగ్గితే..

కార్తికేయ 2 మూవీతో పాన్ ఇండియా లెవల్‌లో కమర్షియల్ సక్సెస్ అందుకున్న యంగ్ హీరో నిఖిల్. ఈ సినిమా అతన్ని ఏకంగా స్టార్ హీరోగా మార్చేసింది. తరువాత వచ్చిన 18 పేజెస్ మూవీ డీసెంట్ హిట్ అయ్యింది. అయితే పాన్ ఇండియా ఇమేజ్‌తో నిఖిల్ చేసిన స్పై మూవీ కెరియర్ లోనే బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా మారింది. ఇక ఈసారి చేయబోయే సినిమాతో కచ్చితంగా బ్లాక్ బస్టర్ కొట్టాలనే కసితో నిఖిల్ ఉన్నాడు. అందుకే ఏకంగా పీరియాడికల్ జోనర్ లో స్వయంభు మూవీ చేస్తున్నాడు. ఈ సినిమాలో రాజుగా నిఖిల్ నటిస్తున్నాడు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో స్వయంభు మూవీ తెరకెక్కుతోంది. మూవీలోని యుద్ధ సన్నివేశాల కోసం నిఖిల్ ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు. దర్శకుడు భరత్ కృష్ణమాచారికి కూడా ఇదే మొదటి సినిమా. నిజానికి ఈ సినిమాని 50 కోట్ల బడ్జెట్ లో కంప్లీట్ చేయాలని అనుకున్నారంట. అయితే ప్రస్తుతం 70 శాతం షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ మూవీకి 80 కోట్ల వరకు ఖర్చవుతునట్లు టాక్ వినిపిస్తోంది. అంటే నిఖిల్ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ స్వయంభు సినిమాకి ఖర్చు చేస్తున్నారు. మిగిలిన 30 శాతం షూటింగ్ కంప్లీట్ అయ్యేసరికి బడ్జెట్ 100 కోట్లు దాటిపోవచ్చని అంటున్నారు. అదే జరిగితే నిఖిల్ కెరియర్ లో స్వయంభు చాలా పెద్ద రిస్క్ ప్రాజెక్ట్ అవుతుంది. ప్రస్తుతం మార్కెట్ లెక్కల ప్రకారం చూసుకుంటే అతనిపై 30 కోట్ల బిజినెస్ నడుస్తోంది. స్వయంభు పీరియాడికల్ కంటెంట్ కాబట్టి ఒక 50 కోట్ల వరకు బిజినెస్ చేసే ఛాన్స్ ఉందని భావిస్తున్నారు. అంతకు మించి డిస్ట్రిబ్యూటర్స్ నిఖిల్ పై డిస్ట్రిబ్యూటర్స్ రిస్క్ చేయకపోవచ్చు. కార్తికేయ 2 చిత్రానికి సెంటిమెంట్ బాగా వర్క్ అవుట్ అయ్యింది. దైవాన్ని ముడిపెట్టి కథ చెప్పడంతో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అయ్యారు. ఆ సినిమా 25 కోట్ల బడ్జెట్ తోనే తెరకెక్కింది. ఇక సినిమా 58 కోట్ల రేంజ్ లో షేర్ కలెక్షన్స్ వచ్చాయి. కార్తికేయ 2 బడ్జెట్ తో పోల్చుకుంటే స్వయంభుకి 3 రేట్లు ఎక్కువ అవుతోంది. కచ్చితంగా నిఖిల్ కెరియర్‌లో ఇది హై రిస్క్ మూవీ అనే మాట వినిపిస్తోంది. 50 కోట్ల థియేట్రికల్ బిజినెస్ చేసిన మరో 50 కోట్లు నాన్ థీయాట్రికల్ ద్వారా రావాలి. నిర్మాతలు సొంతంగా రిలీజ్ చేసుకొని సినిమాకి సూపర్ హిట్ టాక్ వస్తే పెట్టు బడి మొత్తం రికవరీ అవుతుంది. లేదంటే హిట్ అయ్యి లాభాలు వచ్చిన నిర్మాతలకి పెద్దగా కలిసి రాకపోవచ్చని ట్రేడ్ పండితులు అంటున్నారు. నిఖిల్ ఈ రిస్క్ ని దాటితే ఇక అతని మార్కెట్ కూడా అమాంతం పెరిగిపోవడం ఖాయం అని చెబుతున్నారు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

## విజయ్‌తో.. పూజా హెగ్డే!

ఇటీవలే 'గోట్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు విజయ్. ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఈ సినిమా తరవాత విజయ్ పూర్తిగా రాజకీయాలతో మమేకం అవుతాడని, సినిమాలు వదిలేస్తాడని ప్రచారం జరిగింది. అయితే 'గోట్' దెబ్బతో విజయ్ మరో సినిమా చేశాకే, బ్రేక్ తీసుకోవాలని భావిస్తున్నాడని టాక్. హెచ్. వినోద్ చెప్పిన కథని విజయ్ ఇది వరకే అంగీకరించాడు. ఈ సినిమాని అతి త్వరలోనే సెట్స్‌పైకి తీసుకెళ్తారని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా పూజా హెగ్డేని ఎంచుకొనే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. పూజాకు విజయ్‌తో ఇది రెండో సినిమా అవుతుంది. ఇది వరకు 'బీస్ట్'లో జంటగా నటించారు. పూజాకు కొంతకాలంగా సరైన అవకాశాలు లేవు. విజయ్ తో సినిమా ఓకే అయితే, తన కెరీర్ మళ్లీ పుంజుకొన్నట్టే అనుకోవాలి. ప్రస్తుతం వినోద్ ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా ఉన్నాడని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి, 2024 వేసవిలోగా విడుదల చేయాలన్నది ప్లాన్. విజయ్ ఈ సినిమాకు కేవలం 60 రోజుల కాల్షీట్లే కేటాయించాడని తెలుస్తోంది. దాని ప్రకారమే షెడ్యూల్స్ ప్లాన్ చేస్తోంది చిత్రబృందం. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...



# రెజీనా.. ఇప్పటికైనా క్లిక్కయ్యేనా?

కొంతమంది హీరోయిన్స్ అందం, అభినయం ఉన్న కూడా ఆశించిన స్థాయిలో కమర్షియల్ స్టార్ హీరోయిన్‌గా ఎదగలేకపోతారు. అలాంటి వారిలో రెజీనా కాసాండ్రా కూడా ఉంటుంది. ఈ బ్యూటీ 2005లో మాతృభాష తమిళ్ లో హీరోయిన్‌గా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే 2010లో శివ మనసులో శృతి అనే సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. సుధీర్ బాబు హీరోగా తెరకెక్కిన మొదటి చిత్రం ఇది. ఈ మూవీ ఆశించినస్థాయిలో సక్సెస్ కాలేదు. తరువాత ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో సందీప్ కిషన్‌కి జోడీగా రొటీన్ లవ్‌స్టోరీ మూవీ చేసింది. ఈ మూవీ బాగుందనే టాక్ సొంతం చేసుకుంది. తరువాత రారా క్రిష్ణయ్య చిత్రంలో మరల సందీప్ కిషన్‌తో జతకట్టింది. అయితే రవితేజతో చేసిన పవర్, సాయిధరమ్‌తేజ్ మొదటి చిత్రం పిల్లా నువ్వు లేని జీవితం రెజీనాకి కమర్షియల్ బ్రేక్ ఇచ్చాయి. అక్కడి నుంచి వరుస సినిమాలు చేసుకుంటూ వచ్చింది. తెలుగు, తమిళ్ భాషలలో బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో రెజీనా బిజీ హీరోయిన్‌గా మారిపోయింది. తెలుగులో ఛాన్స్‌లు తగ్గిన మాతృభాష తమిళంలో మాత్రం బాగానే అవకాశాలు అందుకుంది. 2019లో తెలుగులో 'ఎవరు' సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో ఆమె చివరిగా సక్సెస్ అందుకుంది. తరువాత తమిళంలోనే ఎక్కువ సినిమాలు చేసింది. అయితే చెప్పుకోదగ్గ సక్సెస్‌లు రాలేదు. 2022లో శాకినీ డాకినీ మూవీతో ఈ బ్యూటీ తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ ఫ్లాప్ అయ్యింది. మంచి టాలెంటెడ్ యాక్టర్‌గా పేరు తెచ్చుకున్న కూడా రెజీనా కాసాండ్రా కమర్షియల్ హీరోయిన్ కాలేకపోయింది. ఆమె ఏడాది క్రితం కంప్లీట్ చేసిన ఉత్సవం అనే మూవీ థియేటర్స్‌లోకి వస్తోంది. ఈ సినిమా కోసం రెజీనా గట్టిగానే ప్రమోషన్ చేస్తోంది. రంగస్థల కళాకారుల జీవితాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో చాలామంది స్టార్ యాక్టర్స్ ఉన్నారు. ఈ సినిమా సక్సెస్ అయితే మరల తెలుగులో అవకాశాలు పెరుగుతాయని ఈ బ్యూటీ ఎక్స్‌పెక్ట్ చేస్తోంది. తమిళంలో రెండు, హిందీలో రెండు సినిమాలలో రెజీనా నటిస్తోంది. అయితే అవి లీడ్ రోల్స్ కాదంట. దీంతో హీరోయిన్‌గా మరల ఛాన్స్‌లు పెరగాలంటే ఒక్క కమర్షియల్ సక్సెస్ కావాలని భావిస్తోంది. ఉత్సవం కంటెంట్ బాగుండటంతో ఆడియన్స్‌కి నచ్చుతుందని ఈ సినిమాని బలంగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...



# కోల్‌కతా టు లడాఖ్!

## రిక్షాపుల్లర్ ఆసక్తికర ప్రయాణం






లడాఖ్ బైక్ ట్రిప్స్ కామన్. చాలామంది సైకిళ్లపైనా ఆ సాహసోపేతమైన పర్యటనకు వెళ్తూ లైఫ్ జర్నీని ఆస్వాదిస్తుంటారు. అయితే, ఇప్పుడవి ఖర్దుంగ్ లా రోడ్డులో సర్వసాధారణమైపోయిన పర్యటనలు. కానీ, ఓ రిక్షాపుల్లర్ తన రిక్షాలో పర్యటించడం విశేషం. దాన్ని డాక్యుమెంటరీగా తెరకెక్కించడం.. ఆ తర్వాత లడాఖ్ చలే రిక్షావాలా అనే ఆ డాక్యుమెంటరీ 65వ జాతీయ చలనచిత్ర అవార్డును సాధించడం ఇంకో విశేషం.

### సత్యేన్ దాస్ కథకు జాతీయ అవార్డ్!

దక్షిణ కోల్‌కతా నక్తాలాకు చెందిన సత్యేన్ దాస్ స్థానికంగా ఓ రిక్షా నడిపి బతికే కార్మికుడు. ఓసారి పూరీ జగన్నాథుణ్ని దర్శించుకోవాలన్న సంకల్పం కల్గింది సత్యేన్ దాస్‌కి. కానీ, రైల్లో వెళ్దామంటే డబ్బుల్లేవు. దాంతో స్థానికంగా నలుగురిని గమ్యాలకు చేర్చే తన రిక్షానే పూరీ ప్రయాణానికీ వాహనం చేసుకున్నాడు. ఆ తర్వాత పలుచోట్లకు అడ్వెంచరస్‌గా ప్రయాణాలు చేయడం సత్యేన్ దాస్‌కి అలవాటుగా మారిపోయింది. అందులో చెప్పుకోదగ్గ జర్నీ లడాఖ్. ఓ సందర్భంలో నక్తాలాకు చెందిన టీవీ ప్రొడ్యూసర్ ఇంద్రాణి చక్రవర్తిని తన రిక్షాలో తీసుకెళ్తున్న సమయంలో.. ఆమెతో మాటలు కలిశాయి. దాంతో తానెన్నో సుదూర ప్రయాణాలు చేసినట్టు ఇంద్రాణికి చెప్పుకొచ్చాడు సత్యేన్. అంతేకాదు, తాను వెళ్లినప్పటి కొన్ని ఓల్డ్ ఫోటోలు చూపించడంతో పాటు.. తన నెక్స్ట్ ట్రిప్ లడాఖ్‌కు వెళ్లాలని ఉన్నట్టు చెప్పాడు సత్యేన్ దాస్. ఆ సత్యేన్ స్టోరీకి ఎందుకో ఇంద్రాణీ కనెక్టయ్యారు. అయితే, తాను అంతదూరం అతనితో ప్రయాణం చేయలేదు. కానీ, సత్యేన్ లడాఖ్ రిక్షా జర్నీ మాత్రం డాక్యుమెంటరీగా మల్చాలనుకున్నారు. అందుకోసం సత్యేన్‌కి ఓ హ్యాండీక్యామ్ వీడియో కెమెరా కొనిచ్చారు. దానిపై అతడికి ఎలా షూట్ చేయాలో నేర్పించారు. చివరగా తాను లడాఖ్‌కు చేరే సమయానికి తన బృందంతో కలిసి తాము అక్కడికి చేరుకోవాలనే ఒక ప్లాన్ రచించారు. అలా 2014లో సత్యేన్ దాస్ కోల్‌కతా టూ లడాఖ్ ప్రయాణం ప్రారంభమైంది. 68 రోజుల పాటు 3వేల కిలోమీటర్లు జార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, శ్రీనగర్ మీదుగా సాగింది. అయితే, మార్గమధ్యంలో బనారస్ వద్ద సత్యేన్ హ్యాండీక్యామ్ పని చేయలేదు. దాంతో ఇంద్రాణి తన అసిస్టెంట్స్‌ను పంపి ఆ కెమెరా రిపేర్ చేయించి సత్యేన్ చేతుల్లో పెట్టడంతో తన ప్రయాణాన్ని తానే హ్యాండీక్యామ్‌తో షూట్ చేసుకుంటూ.. అక్కడెవరైనా కనబడితే వారితో షూట్ చేయిస్తూ మొత్తంగా ఒక పూర్తిస్థాయి 65 రోజుల వీడియో రికార్డ్ తయారు చేశాడు సత్యేన్. సత్యేన్ లడాఖ్ రిక్షా ప్రయాణాన్ని డాక్యుమెంటరీ చేసే క్రమంలో ఇంద్రాణి అతడికి కావల్సిన రూట్ మ్యాప్స్, బట్టలు, ఎక్కడాగితే అక్కడ భోజనానికి కావల్సిన అన్ని ఏర్పాట్లూ చేశారు. అలా మొత్తానికి ప్రసిద్ధిగాంచిన ఎత్తైన కర్దుంగ్ లా పాస్‌కు 2014 ఆగస్ట్ 17న చేరుకున్నాడు సత్యేన్.




### జర్నీలో ఎదుర్కొన్న సమస్యలెన్నో!


సత్యేన్‌కు కావల్సిన మౌలిక సదుపాయాలు ఇంద్రాణీ సమకూర్చినప్పటికీ సత్యేన్ ఎన్నో సవాళ్లనెదుర్కోవాల్సి వచ్చింది. తన ప్రయాణంలో భోజనం సమయానికి దొరక్కపోవడం, సముద్ర మట్టానికి 11,500 అడుగుల ఎత్తులో ఉన్న లేహ్ ప్రాంతంలో ఆక్సిజన్ కొరత, అధ్వాన్నమైన రోడ్లు వంటివి సత్యేన్‌ను ఇబ్బంది పెట్టాయి. ఇన్‌స్టంట్ న్యూడుల్స్, ఆలు ఛోకా బాట్ వంటివే ఆయన ఆహారమయ్యాయి. 11,500 అడుగుల ఎత్తులో జోజి లా పాస్ వద్ద శ్రీనగర్ నుంచి లేహ్ మార్గం తన రిక్షా జర్నీలో అత్యంత ఇబ్బందికరంగా మారిందంటాడు సత్యేన్. 8 కిలోమీటర్ల ప్రయాణంలో తన సామాన్లతో పాటు ఆ కొండమార్గంలో గుంతలు పడ్డ రోడ్లపై రిక్షాతో ప్రయాణించడం ఓ అడ్వెంచరస్‌గా తల్చుకుంటాడు సత్యేన్.

### సవాళ్లకు పరాకాష్ఠలా ఖర్దుంగ్ లా పాస్ జర్నీ!

11,500 అడుగుల ఎత్తులో ఉండే జోజిలా పాస్ చేరికే కష్టమంటే.. అక్కడ్నుంచి, ప్రపంచంలోనే ఎత్తైన ఖర్దుంగ్ లా పాస్ కు చేరాలంటే అది 17,500 అడుగుల ఎత్తులో ఉంటుంది. బైక్స్‌పై వెళ్లే సాహసయాత్రీకులు కూడా ఒకింత కష్టపడితే గానీ ఆ హైట్స్‌కి చేరలేరు. అలాంటి చోట రిక్షా దిగి తన బరువులను ఓవైపు మోసుకుంటూనే.. ఆక్సిజన్ సరిగా అందని ఆ గుట్టలపై సత్యేన్ తన రిక్షాను లాక్కుంటూ వెళ్లిన ఆ సన్నివేశాలన్నీ సాహసోపేతమైనవే. వీటన్నింటినీ మించి అక్కడి మంచుకొండల్లో ఓ చిరుత సత్యేన్ కంటపడింది. కానీ, దాని దృష్టి సత్యేన్‌పై పడకపోవడంతో తాను బతికి బట్టకట్టానంటాడు సత్యేన్. సత్యేన్ లడాఖ్ జర్నీపైన ఆయన భార్య మున్నీ మాత్రం కోపంగా ఉండేది. తన బిడ్డ ప్రియాంకతో కంప్లైంట్. తండ్రి వ్యవహారంపై కంప్లైంట్ చేస్తుండేది. మనల్ని ఇలా వదిలేసి తన దారిన తాను చెట్లు, గుట్టలంటూ తిరగడమేంటన్నది ఆమె కోపానికి కారణం. సత్యేన్ దాస్ తన కలల ప్రపంచంలో తిరుగుతుండటంపై ఆమె ఆందోళన వ్యక్తంచేసేది.



అలా తన భార్య తనపై పెంచుకున్న కోపాలు, తన జర్నీలో తను పడ్డ కష్టాలతో పాటు ఎన్నో తీపి జ్ఞాపకాలు కూడా ఉన్నాయంటారు సత్యేన్. మార్గమధ్యంలో లడాఖ్ ప్రయాణంలో కలిసిన సైక్లిస్టులతో ఏర్పడిన పరిచయాల వంటివి తనకు స్ఫూర్తిగా నిల్చేవంటారు. ఆ స్వీట్ అండ్ హాట్ మెమరీస్‌ను గుదిగుచ్చినదే లడాఖ్ చలే రిక్షావాలా డాక్యుమెంటరీ. అందుకే ఈ డాక్యుమెంటరీ 65వ జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ది బెస్ట్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ అడ్వెంచర్ ఫిల్మ్ కోటాలో అవార్డ్ అందుకుంది.



అయితే, 2014లో లడాఖ్ జర్నీ చేసిన సత్యేన్ దాస్ మళ్లీ 2017లోనూ ఇదే రూట్‌లో తన రిక్షా ప్రయాణాన్ని పెట్టుకున్నాడు. ఈసారి గ్లోబల్ వార్మింగ్‌పై సందేశాన్నిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించాడు. దారిపొడవునా మార్గమధ్యంలో 5వేల ఖర్జూరా మొక్కలను నాటుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు, చెట్ల అవసరమెంతో చెబుతూ తన జర్నీని ఓ మెస్సేజ్ ఓరియెంటెడ్‌గా మార్చాడు. అంతేకాదు, తాను నడుపుతున్న సైకిల్ రిక్షా కూడా ఎకో ఫ్రెండ్లీ అనే నినాదాన్ని జనంలోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఉపయోగపడిందంటాడతను. మొత్తంగా తన జర్నీలో పడ్డ కష్టాలు, సవాళ్లను మించి.. ఆ పచ్చని ప్రకృతి అందాల నడుమ అవన్నీ మటుమాయమయ్యాయంటాడు సత్యేన్. తన ప్రయాణం తన జీవితంలో ఓ ల్యాండ్ మార్క్‌గా నిల్చిపోయిందని, ఇలాంటి అవకాశం ఎందరికి వస్తుందని ప్రశ్నిస్తాడతను.

– రమణ కొంటికర్ల

## ప్రజా పోరాటాలు నిర్మించడమే ఏచూరికి నివాళి




(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

ప్రజా పోరాటాలను నిర్మించడమే సీతారాం ఏచూరికి మనమర్పించే ఘన నివాళి అని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. ప్రముఖ పోరాట యోధుడు, సీపీఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సిటు శ్రీకాకుళం జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. శుక్రవారం నాగార్జున అగ్రికం పరిశ్రమ వద్ద సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో పారిశ్రామిక ప్రాంతం పైడిభీమవరంలో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ కార్మికుల 100 రోజుల సమ్మె సందర్భంగా జిల్లాకు వచ్చి కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. ఏచూరి మృతి కమ్యూనిస్టు, ప్రజాతంత్ర లౌకిక ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికం కార్మిక సంఘం నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, ఏ.సత్యనారాయణ, చిక్కాల సత్యనారాయణ, గణపతిరావు, చిన్న, సుధాకర్, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులదే కీలకపాత్ర



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

పర్యావరణం పరిరక్షణలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. ఝాన్సీ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బలగ మున్సిపల్ నగరపాలక హైస్కూల్ ప్రాంగణంలో ఆయన శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్క విద్యార్థి మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల అవుతుందని, ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం కలగడానికి, పర్యావరణం పరిరక్షణకు ఉపయోగపడతాయని అన్నారు. బలగ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఏ.వి. మురళీ కృష్ణ మాట్లాడుతూ ఇంట్లో పెంచుకునే మొక్కలతో వ్యాధి నిరోధక శక్తి బలపడుతుందని అన్నారు. జ్యోతిరావు పూలే ఆల్ ఇండియా ఓబీసీ ఉత్తరాంధ్ర జనరల్ సెక్రెటరీ రౌతు శంకరరావు మాట్లాడుతూ మొక్కలు ఆరోగ్యంగా ఉండటానికి, ప్రకృతిని కాపాడటానికి, పిల్లల్లో ప్రకృతిని పెంచే గుణం కలిగించడానికి ఉపగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌వైకే గణాంకాధికారి, కార్యక్రమ సహాయకులు డి.శ్రీనివాసరావు, ఝాన్సీ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రౌతు సుమతి మోహనరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఎ.పున్నయ్య, వ్యాయామ ఉపాధ్యాయరాలు రాజేశ్వరి, సత్యనారాయణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అలరించిన శృతి లయ రంజని




(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

శృతిలయ రంజిని మృదంగ లయ విన్యాసం సూర్య ప్రసాదరావు ఆధ్వర్యంలో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. మృదంగ లయ విన్యాసంలో మండ శ్రీనివాసరావు, బంకుపల్లి దుర్గాశ్రీనివాసశర్మ పాల్గొన్నారు. లయ విన్యాస కార్యక్రమానికి మావుడూరు సత్యనారాయణ శర్మ, శ్రీనివాసరావు, వయోలిన్‌పై వాయునందన శర్మ సహకరించారు. మండా క్రిష్ణరామ్‌ప్రసాద్ జయంతి ఉత్సవం జిల్లా కేంద్ర గ్రంథాలయలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ క్రిష్ణరామ్ ప్రసాద్ తన జీవితం సర్వస్వం మృదంగానికి శాస్త్రీయ సంగీత పరిరక్షణకు అంకితం చేసారని కొనియాడారు. ఆయన జయంతి అయన శిష్యుడు శ్రీనివాసరావు నిర్వహించడం ముదావహమన్నారు. కేంద్ర గ్రంధాలయం సెక్రటరి బుర్రి కుమార్‌రాజు మాట్లాడుతూ గ్రంధాలయంలో ఇటువంటి జనరంజకమైన సంగీత కార్యక్రమం నిర్వహించడం తమ అదృష్టమన్నారు. సుసరాపు లక్ష్మీగణపతి శర్మ మాట్లాడుతూ క్రిష్ణప్రసాద్ శిష్య పరమాణువు, మానస పుత్రుడు శ్రీనివాస్ సంగీత ప్రపంచానికి ప్రసాద్ గొప్పతనం చాటిచెప్పే అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించడం ముదావహమన్నారు. అనంతరం మావుడూరు సూర్యప్రసాదరావును పుష్పమాలలు, జ్ఞాపిక, పురస్కారం, సన్మానపత్రం, శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గొన్నాభక్తుల రవి, సుసరాపు కుమార్ విఘ్నేశ్, రెడ్డి షణ్ముఖ శ్రీచరణ్‌లు మృదంగ లయ విన్యాసాలతో ప్రసాద్‌కు నివాళి అర్పించారు. రెడ్డి సత్యనారాయణ, విశ్వేశ్వరరావు, జాక త్రివిక్రమ దేవ్, సతీష్‌లు శాస్త్రీయ సంగీతంతో నివాళి అర్పించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా ట్రస్ట్ కోశాధికారి మండ కామేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో శాశ్వత ట్రస్టీలు ప్రసాదరావు, రమణమూర్తి, నిక్కు అప్పన్న, రామలింగేశ్వరరావు, చిట్టి వెంకటరావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తమ్మతల్లి పండుగ రాష్ట్ర పండుగా ప్రకటించాం

(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

కొత్తమ్మ తల్లి పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అందరి సహకారం, కొత్తమ్మ తల్లి ఆశీస్సులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని మంత్రి అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌తో కలసి గురువారం కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లి దర్శనం చేసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అక్టోబర్ 1,2,3 తేదీల్లో నిర్వహించనున్న పండగకు ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా తాగునీరు, క్యూలైన్లు, పారిశుధ్యం నిర్వహణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయాలని, దేవాలయానికి రంగులు వేయాలన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. గుడికి విద్యుదీకరణ ఏర్పాటు చేయాలన్నారు. పండుగకు వచ్చిన భక్తులకు అన్నదానం, ఉచిత ప్రసాదం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఉత్సవానికి సుమారు మూడు లక్షల మంది భక్తులు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రం నుంచి కూడా రానున్నారని, అన్ని శాఖల సమన్వయంతో పండగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.


























# ధరల దరువు

(మొదటిపేజీ తరువాయి)

కూరగాయలు, పప్పుదినుసుల ధరలు పెరిగి సామాన్యులకు భారంగా మారుతున్నాయి. జిల్లాలో కూరగాయలు సాగు తగ్గడం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ధరలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ధరలు పెరుగుదలపై ఇటీవల కురిసిన వర్షాల ప్రభావం పడిందని అధికారులు చెబుతున్నా అందులో వాస్తవం లేదు. జూన్, జూలై నెలల్లో వర్షాభావం కావడం కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. శ్రావణ మాసం కావడంతో డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేకపోవడంతో ధరలు కొంతమేర పెరిగాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వరితో పాటు ఇతర వాణిజ్య పంటలకు రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. మైదాన ప్రాంతాల్లో మాత్రమే కూరగాయలు సాగు చేస్తుంటారు. వీటిలో ఆరుతడి పంటల వైపే రైతులు మక్కువ చూపిస్తుంటారు. పొలాల్లో కూరగాయలు సాగుచేసి ఖరీఫ్ సీజన్ వచ్చిన తర్వాత వాటిని తొలగించి వరితో పాటు సంప్రదాయ పంటలు వేస్తుంటారు. దీంతో జిల్లాలో కూరగాయల దిగుబడి తగ్గి డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా జరగక ధరలు పెరగడం ఏటా సర్వ సాధారణం.

జిల్లాలో ప్రస్తుతం బెండ, వంకాయ, బీర పంటలు మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. అక్కడక్కడ పచ్చిమిర్చి, కాకర, గోల్కొండ చిక్కుడును పండిస్తున్నారు. మిగతా కూరగాయలు, దుంపజాతులు, ఉల్లి, టమాటాను దిగుమతి చేసుకుంటున్నారు. శ్రీకాకుళం నగరం పరిధిలో గార, శ్రీకాకుళం రూరల్, ఎచ్చెర్ల, లావేరు, పొందూరు, ఆమదాలవలసలో అక్కడక్కడ కూరగాయల సాగు జరుగుతుంది. ఈ పంటలను నగరంలోని రైతుబజార్‌కు తీసుకువచ్చి విక్రయించే రైతులు చాలా తక్కువ. పంట పొలం వద్దనే వ్యాపారులు టోకు ధరకు కొనుగోలుచేసి మార్కెట్‌కు తరలించుకుపోయి చిల్లర ధరలకు అమ్ముతుంటారు. అక్కడ వ్యాపారులు అమ్ముతున్న ధరను బట్టి రైతుబజార్‌లో ధరను నిర్ణయించి కేజీపై రూ. 5 నుంచి రూ. 10 వరకు తగ్గించి విక్రయించేలా చర్యలు తీసుకుంటారు. ఉల్లిని కర్నూలు, మహారాష్ట్ర నుంచి, బంగాళాదుంపలను బెంగాల్ నుంచి, టమోటాను చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి జిల్లాకు దిగుమతి అవుతుంటాయి. వెల్లుల్లి, అల్లం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వీటిని హోల్‌సేల్ వ్యాపారులు నుంచి స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లోనూ, రైతులు రైతుబజార్‌లోను విక్రయిస్తుంటారు. దీంతో వీటి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తుంటాయి. గత ఏడాది సెప్టెంబర్‌తో పోల్చితే ఈ ఏడాది కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. జిల్లాలో ఉన్న శ్రీకాకుళం, ఆమదాలవలస, కోటబొమ్మళి రైతుబజారుల్లో ధరల్లోనూ వ్యత్యాసం కనిపిస్తుంది. స్థానికంగా రైతులు పండించిన పంటలు రైతులు తీసుకువస్తే స్థానిక మార్కెట్లో ధరలను బట్టి రైతుబజార్లో అధికారులు ధరలను నిర్ణయిస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న కూరగాయలు విషయంలో మాత్రం స్థానిక పెద్దమార్కెట్‌ను అనుసరించే విక్రయాలు జరుపుతున్నారు.

శ్రీకాకుళం రైతుబజార్‌కు ప్రతి రోజు రూ. 1.5 టన్నుల కూరగాయలు, ఆదివారం 2 టన్నుల మేరకు కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. వీటిలో ఉల్లి, బంగాళదుంపలు, టమోటాలదే అగ్రభాగం. అక్టోబర్ నుంచి కూరగాయల దిగుబడి తగ్గి డిమాండ్ పెరగనుందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల కూరగాయల ధరలు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. పెళ్లిళ్లు, పండగల సీజన్ కావడం వల్ల కూరగాయలకు డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మరో రెండు నెలల్లో టమోటా, క్యాబేజీ స్థానిక రైతుల వద్ద అందుబాటులోకి వస్తుందని, వీటి ధర దిగివస్తుందని అధికారులు చెబుతున్నారు. వర్షాలు, విపత్తులు సంభవించకుంటే కూరగాయలు ధరలు స్థిరంగా కొనసాగుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అల్పపీడన ప్రభావం వల్ల వర్షాలు కురవడంతో కూరగాయ పంటలకు ఎక్కువ నష్టం జరిగిందని అధికారులు చెబుతున్నారు. దీనివల్లనే ధరలు పెరుగుదల నమోదవుతుందని చెబుతున్నారు. పెరిగిన కూరగాయలు, పప్పుదినుసుల ధరలు సామాన్యులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హిందీపండగకు కలెక్టర్‌కు ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హిందీ ఉపాధ్యాయులంతా కలిసి పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో శనివారం హిందీ పండగ ఘనంగా నిర్వహిస్తున్నట్టు హిందీ ఫోరమ్ జిల్లా సమన్వయకర్త ఐ. సంతోష్‌కుమార్ తెలిపారు. ఈమేరకు కలెక్టర్‌కు ఆహ్వానించారు. జాతీయ భాష హిందీ ఔన్నత్యాన్ని చాటేవిధంగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో కుమ్ములాట

(మొదటిపేజీ తరువాయి)

జరిగిందన్న విషయం తనకూ తెలుసని, కాకపోతే అధిష్టానం నుంచి పరమేశ్వరరావు మీద ఫిర్యాదు చేయాలని ఆదేశాలు రావడంతోనే ఆ మేరకు పంపిన ఫిర్యాదు ప్రతిని ఇక్కడి పోలీసులకు అందించానని అంబటి కృష్ణ ఒప్పుకున్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు రికార్డ్ చేశారు. అంబటి కృష్ణ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులెవరూ హాజరు కాకపోవడానికి కారణం పరమేశ్వరరావేనని పీసీసీకి తెలపడంతో వారు ఈ సలహా ఇచ్చినట్టు తెలుస్తుంది. శుక్రవారం సమావేశంలో ఫిర్యాదు ఇవ్వడం తప్పని, గతంలో కూడా షార్ట్ సర్క్యూట్ జరిగిందన్న విషయం తనకు తెలియక ఇలా చేశానని ఒప్పుకున్న అంబటి కృష్ణ ఫిర్యాదును మాత్రం అధిష్టానం ఆదేశం లేకుండా వెనక్కు తీసుకోలేనన్నారు. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు 8 మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సీఐ పైడపునాయుడును కలిసి తప్పుడు ఫిర్యాదు వెనక్కు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ మూడు రోజుల శిక్షణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ డి.రవి, డిఆర్‌కె అమ్మన్నాయుడు తెలిపారు. గురువారం పెద్దపాడులో నిర్వహించన శిక్షణా తరగతుల్లో శుక్రవారం వారు మాట్లాడారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో హోంగార్డెనింగ్ కోర్స్‌ను మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సేంద్రీయ కూరగాయులు, పప్పుదినుసుల ప్రాధాన్యతను కెమికల్ పద్ధతిలో పండించే పంటల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. అనంతరం హోంగార్డెన్‌పైన సభ్యులకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ బెంగుళూరు ఇంటర్నేషనల్ సెంటర్ ట్రైనింగ్ నుంచి వచ్చిన గైడ్‌లైన్స్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వి.సందీప్, మీడియా కోఆర్డినేటర్ కె.ఎస్.జె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హిందీ భాషా దినోత్సవం

(సత్యంన్యూస్, నరసన్నపేట)

స్థానిక బోర్డు స్కూల్‌లో శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్ర ప్రోత్సాహంతో మూలపేట వివేకానంద యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీభాష గొప్పదని భాష పాచుర్యాన్ని ప్రతి విద్యార్థికి వివరించవలసిన అవసరం ఉందని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (బోర్డు) ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీనివాసరావు అన్నారు. హిందీ అధ్యాపకులు కృష్ణారావు మాటాడుతూ మాతృభాషతో పాటు హిందీ కూడా నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. హిందీ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర సహాయ అధ్యాపకులు గుండు వెంకటరమణ, ఉమా మహేశ్వరరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు




## పారదర్శకంగా మహిళా పోలీసులు బదిలీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

సాధారణ బదిలీలో భాగంగా జిల్లాలో వివిధ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులకు గురువారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బదిలీలు నిర్వహించారు. ఎస్పీతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి.వాసుదేవరావు కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా మహిళ పోలీసులు బదిలీలు నిర్వహించారు. 238 మంది మహిళా పోలీసులు బదిలీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 71 మందికి బదిలీలు చేయగా, 149 మంది యధావిధి స్థానాల్లో కొనసాగడానికి అంగీకరించగా, 18 మంది గైరాజరయ్యారు. బదిలీలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే చేస్తామన్నారు. పోస్టింగు కోరుకునే ఉద్యోగి స్వగ్రామం/ వార్డు ఉండే సచివాలయం మినహా ఇతర సచివాలయాలను కోరుకోవాలని ఎస్పీ సూచించారు. బదిలీల కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్ కేటీశ్వరరావు, సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఏచూరి మృతి పట్ల కోండ్రు దిగ్భాంతి

(సత్యంన్యూస్, రాజాం)



ప్రజాపోరాట యోధుడు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ తీవ్ర దిగ్భాంతి వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. విద్యార్థి ఉద్యమం నుంచి బయట పడి తొమ్మిదేళ్లపాటు పొలిట్‌బ్యూరో సభ్యుడి గానూ సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా కష్టతరమైన రాజకీయ దశల్లో పార్టీని నడిపించిన ఘనత ఏచూరిదేనన్నారు. పార్టీ నాయకత్వ స్థానాల్లో సరైన స్థానాలను ఏర్పరచడం ద్వారా భారత రాజకీ యాలకు సీతారాం మార్గదర్శకంగా వ్యవహరించారన్నారు. తెలుగు వారైన వామపక్ష నేత సీతారాం స్వశక్తితో జాతీయస్థాయిలో ఉన్న తంగా ఎదిగారన్నారు. అహర్నిశలు ఏచూరి ప్రజాసేవకు తన జీవి తాన్ని అంకితం చేశారన్నారు. తన మరణానంతరం పార్థీవ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం దానం చేయడం గొప్ప విషయమన్నారు.



ఇచ్ఛాపురం పర్యటనకు వెళుతున్న వైకాపా జిల్లా అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌కు నందిగాం పార్టీ కార్యా లయం వద్ద టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా స్వాగతం పలికాయి. కార్యక్రమంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు – సత్యంన్యూస్,టెక్కలి

## క్రైమ్ అదనపు ఎస్పీగా పి.శ్రీనివాసరావు

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)



జిల్లా క్రైమ్ అదనపు ఎస్పీగా పి శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కె.వి మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ డిఎ స్పీగా విధులు నిర్వహిస్తు ఉద్యోగోన్నతిపై అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.

## జాతీయ సమైక్యతకు ప్రతీక హిందీ

(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

బహుళ భాషలు గల భారతదేశంలో ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చి జాతీయ సమైక్యతకు ప్రతీకగా హిందీ భాష నిలిచిందని బోరుభద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అన్నారు. హిందీ ఉపాధ్యాయినిలు దేవగుప్తపు ఉమాదేవి, బాదిరెడ్డి నాగమణిల ఆధ్వర్యంలో జాతీయ హిందీ దినోత్సవ వేడుకలు పాఠశాలలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామకృష్ణ, హిందీ అధ్యాపకులు డి.ఉమాదేవి, బి.నాగమణి మాట్లాడుతూ గాంధీ స్ఫూర్తితో జాతీయ భాషగా హిందీని రాజ్యాంగం గుర్తించిన సెప్టెంబర్ 14న జాతీయ హిందీ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారిందన్నారు. పాఠశాలలో విశిష్ట సేవలు అందిస్తూ, టెన్త్ పరీక్షలలో హిందీలో శతశాతం ఫలితాలతో పాటు అత్యధికంగా 100కి 99 మార్కులు సాధించడంలో కృషి చేసిన ఉపాధ్యాయినిలు డి.ఉమాదేవి, బి.నాగమణిలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాధరావు, బాడాన రాజు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ, టి.విజయలక్ష్మి, బి.నాగమణి, కె.తవిటిరెడ్డి, బి.రజని, జి.జగదాంబ, బి.శ్రీనివాసరావు, పి.తిరుపతిరావు, శంకరరావు, గోపాలరెడ్డి, కమల కుమారి, సుశీల దేవి, సాయి శివాని, కృష్ణ, త్రివేణి, రవి పాల్గొన్నారు.



## ఇంకెన్నాళ్లు ఈ రేషన్ కష్టాలు



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

చిన్నరావుపల్లి గ్రామంలో రేషన్ కష్టాలు తప్పట్లేదు. 148 లబ్ధిదారులు గ్రామంలో ఉండగా ఈనెల ఒకటో తేదీన కేవలం 108మందికి రేషన్ పంపిణీ చేశారు. మిగిలిన 40మందికి పంపిణీ చేయకపోవడంతో వారు లబోదిబోమన్నారు. ఎట్టకేలకు మళ్లీ శుక్రవారం రేషన్ పంపిణీ చేపట్టారు. తరచూ ఇలా రేషన్ ఇబ్బందులు తలెత్తడంతో గ్రామస్తులు అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైకాపా ప్రభుత్వంలో వాలంటీర్ వ్యవస్థ ఉండేది. అప్పట్లో జరిగిన తప్పిదానికి ఇప్పుడు కూడా శిక్ష అనుభవించాల్సి వస్తుందని లబ్ధిదారులు అంటున్నారు. హౌస్ హోల్డ్ మ్యాప్‌లో 40 కార్డులు సంతసీతారాంపురం పంచాయతీకి వెళ్లిపోయాయని, దానితో ఈ 40 కార్డులు లబ్ధిదారులు రేషన్ సకాలంలో అందకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై సీఎస్ఆర్ఐ వెంకటేష్‌కు పలుమార్లు ఫోన్లో సంప్రదించినా ఫలితం లేకుండా పోతుందని వారంటున్నారు. అసలు 40 కార్డులు ఎవరివి హౌస్ హోల్డ్ మ్యాప్‌లో వెళ్లాయో వారికి సకాలంలో రేషన్ అందిస్తున్నారని, గ్రామంలో ఉన్న వాటికే రేషన్ ఇవ్వట్లేదని తెలపడం కొసమెరుపు.

## భారతీయ సంస్కృతి విశ్వానికి చాటేందుకు హిందీ దోహదం

(సత్యంన్యూస్, కొత్తూరు)

భారతదేశ సంస్కృతిని ప్రపంచానికి తీసుకెళ్లగల భాష హిందీయేనని పాతపొన్నుటూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు బూడిద సంతోష్ కుమార్ అన్నారు. ఈ నెల 14న హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న యిసై సౌజన్యవతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు హిందీ అంశాలతో కూడిన క్విజ్ పోటీలను నిర్వహించగా, గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేసారు. తరగతి గదుల్లో హిందీ పాఠ్యాంశాల చార్టుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రదర్శనల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసారు. బొమ్మాళి నాగేశ్వరరావు, కుదమ తిరుమలరావులు మాట్లాడుతూ హిందీ అలవడితే దేశంలోను, విదేశాల్లోను మనుగడ సాధించవచ్చని అన్నారు.



# ఏచూరి మృతిపై కార్మిక సంఘాల నివాళులు



(సత్యంన్యూస్, రణస్థలం)

కమ్యూనిస్టు యోధుడు, మాజీ ఎంపీ సీతారాం ఏచూరి మృతి వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్యశక్తులకు, శ్రామిక వర్గానికి తీరని లోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు అన్నారు. శుక్రవారం పైడిభీమవరంలో డా.రెడ్డీస్ పరిశ్రమ వద్ద సీతారాం ఏచూరి సంతాపసభ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ 2011లో రెడ్డీస్ కార్మికులు నిర్వహించిన సమ్మె పోరాటానికి సీతారాం ఏచూరి సంఘీభావం తెలిపారని గుర్తు చేశారు. కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శి, సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల సమన్వయ రథసారథిగా సీతారాం ఏచూరి దేశ ప్రజానీకానికి చేసిన కృషి అమోఘమైనదన్నారు. విద్యార్థి దశ నుంచి మూడు దశాబ్దాలుగా ఏన్నో పోరాటాలకు ఊపిరి పోశారన్నారు. ఎన్నో గడ్డు పరిస్థితులను అధిగమించి, అనేక త్యాగాలతో జైలు జీవితానికి కూడా సిద్ధపడ్డారని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు నిలబడ్డారని తెలిపారు. 12వ తరగతిలో సీబీఎస్ఈ సిలబస్‌లో ఆలిండియా టాపర్‌గా యూనివర్సిటీలో ఎ ప్లస్ విద్యార్థిగా గోల్డ్ మెడల్ సాధించారని, 8 భాషలలో మాట్లాడుతారని తెలిపారు. ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ విద్యార్థి నాయకుడిగా, ఎస్.ఎఫ్.ఐ అఖిలభారత అధ్యక్షులుగా, 32ఏళ్ల వయసులోనే సీపీఎం కేంద్రకమిటీ సభ్యునిగా, పొలిట్‌బ్యూరో సభ్యులుగా, ఉత్తమ పార్లమెంటు సభ్యునిగా, రచయితగా, సీపీఎం ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా ఎంతో సేవ చేశారన్నారు. సంతాప సభలో డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.రామకృష్ణ, బి.సురేష్, టి.వీర్రాజు, పున్నాన శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కేదార్‌నాథ్‌లో భక్తులను గమ్యస్థానాలకు చేర్చాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కేదార్‌నాథ్‌లో దాం యాత్రకు వెళ్లి అక్కడ చిక్కుకుపోయిన యాత్రికులను తక్షణమే హెలి కాప్టర్ సర్వీసుల ద్వారా వారి వారి గమ్యస్థానాలకు చేర్చాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఢిల్లీలోని రెసిడెన్స్ కమిషనర్‌ను అభ్యర్థించారు. గురువారం వాతావరణం అనుకూలించకపోవడంతో ఆకస్మాత్తుగా హెలికాప్టర్ సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో తిరుగు ప్రయాణం కావాల్సిన 20 మంది భక్తులు కేదార్‌నాథ్‌లో చిక్కుకుపోవడంతో వారందరిని రక్షించేందుకు ఎంపీ అప్పలనాయుడు భారత ప్రభుత్వంలోని ఉన్నతాధికారులతోను, కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఫోన్ల ద్వారా సంప్రదించి మోనిటరింగ్‌ను కొనసాగిస్తున్నారు. అలాగే సీఎంవో, పీఎంవో కార్యాలయాలకు కూడా సమాచారాన్ని అందజేసి తక్షణమే హెలికాప్టర్ సర్వీసులను సమకూర్చి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. చిక్కుకుపోయిన వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 16మంది భక్తులు ఉన్నారని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. జీరో డిగ్రీస్ చలిలో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆక్సిజన్ లెవెల్స్ కూడా పడిపోవడంతో భక్తులందరూ ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నారని, తక్షణమే ప్రత్యేక హెలికాప్టర్ సర్వీసులను ఏర్పాటు చేయడం ద్వారా కేదార్నార్‌నాథ్‌లో చిక్కుకుపోయిన భక్తులందరినీ వారి వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు సహాయక చర్యలను చేపట్టాల్సిందిగా ఢిల్లీలోని రెసిడెన్స్ కమిషనర్‌ను అప్పలనాయుడు అభ్యర్థించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.